విశాఖ వేదికగా 11వ అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు

విశాలాంధ్ర - కొమ్మాది: విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 11వ ఆంధ్రప్రదేశ్ పురుషులు, మహిళల అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు విశాలాక్షినగర్‌లోని బి.వి.కె. హైస్కూల్ వేదికగా నవంబర్ 7వ తేదీ శుక్రవారం నుంచి 10వ తేదీ సోమవారం వరకు నాలుగు రోజుల పాటు జరగనున్నాయని విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి 13 జిల్లాల నుండి 350 మంది క్రీడాకారులు, 30మంది రెఫరీలు, మేనేజర్స్, కోచ్‌లు పాల్గొనున్నట్లు తెలిపారు. వివరాలకు వివరాలకు కార్యదర్శి జి.భూషణరావు 9966753209కి సంప్రదించాలని కోరారు.

అక్రమార్కులకు కొండంత 'సహకారం'

పదోన్నతులు, బదిలీలపై వసూళ్లు విచారణ జరపాలని జనసేన కార్పొరేటర్ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: అక్రమార్కులకు అక్కడ సహాయ సహకారాలు పుష్కలంగా అందుతున్నాయి. జిల్లా కేంద్ర సహకార శాఖ బ్యాంకులో పదోన్నతుల వ్యవహారం తీవ్ర దుమారాన్ని రేపుతుంది. బ్యాంకులో కీలక వ్యక్తి సన్నిహి తుల ద్వారా దాదాపు కోటి రూపాయలు వరకు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగుల పదోన్నతుల పేరుతో ఒక్కొక్కరి నుంచి పోస్టును బట్టి మూడు నుంచి ఐదు లక్షల వరకు వసూలు చేసినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతుంది.

మర్రిపాలెంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయమే కాకుండా 33 బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటిలో ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఇటీవల వచ్చిన పాలకవర్గ సభ్యులు నిర్ణయి ంచారు. ఒక డీజీఎం, నాలుగు ఏజీఎం, నాలుగు చీఫ్ మేనేజర్లు, 6 మేనేజర్లు, 12 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని భావించారు. ఇందుకోసం బ్యాంకు పర్సన్ ఇన్చార్జి, సీఈఓ ఆప్కాబ్ నుంచి జనరల్ మేనేజర్ బోర్డు ఆధ్వ ర్యంలో గత నెల 23, 24 తేదీల్లో ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు.

విశాఖ డిసిసిబిపై విచారణ జరపండి

ఆప్కాబ్ ఎండికి జనసేన నేత పీతల మూర్తి యాదవ్ ఫిర్యాదు

విశాఖ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరుగుతున్న కోట్ల రూపాయల అవినీతి అక్రమాలు, నిధుల దుర్వినియోగం, పదోన్నతుల్లో లంచాలపై సి.బి.సి.ఐ.డి, విజిలెన్స్ విచారణ జరపాల్సిందిగా జనసేన కార్పోరేటర్ పీతల మూర్తి యాదవ్ కోరారు. బ్యాంక్ అక్రమాలపై పలు పత్రికలు కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. పత్రికలలో వచ్చిన క్లిప్పింగ్‌తో మూర్తి యాదవ్ ఆప్కాబ్‌తో పాటు సంబంధిత శాఖలన్నిటికీ ఫిర్యాదులు పంపించారు. విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) రాష్ట్రంలోనే ప్రముఖ బ్యాంకు. మూడు లక్షల మంది రైతులకు ఈ బ్యాంకు సేవలందిస్తోందని, ఈ బ్యాంకు పరిధిలో 98 సహకార సంఘాలు 34 బ్రాంచీలు ఉన్నాయని అయితే ఇటీవల కాలంలో కోన తాతారావు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బ్యాంకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అవినీతి అక్రమాలతో రైతులకు తీరని ద్రోహం జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఉద్యోగులు పదోన్నతుల్లో తాతారావు నేతృత్వంలోని బృందం కోటి రూపాయల వరకు వసూళ్లు చేసినట్లు దిన పత్రికల్లో ప్రముఖంగా వార్తలు వచ్చాయని, పదోన్నతుల జాబితాలో మొదటి ఉన్న వారికి కేవలం లంచాలు ఇవ్వని కారణంగా పదోన్నతులు లభించలేదని ఆరోపించారు. రిజర్వేషన్లను కూడా పదోన్నతుల్లో పాటించలేదని దీనిపై బ్యాంకు ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నిరాశ నిస్పృహలు ఆగ్రహం వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. బ్యాంకు చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా సాధారణంగా జరగాల్సిన బదిలీలు పదోన్నతుల్లో కోట్ల రూపాయలు చేతులు మారటంపై విజిలెన్స్, సి.బి.సి.ఐ.డిలతో విచారణ జరిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పర్సన్ ఇన్చార్జి అయిన కోన తాతారావు తన కుమారుడు బావమరిదితో భారీగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వున్నాయని, గతంలో ఈ బ్యాంకుకు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పర్సనల్ ఇన్చార్జిగా వ్యవహరించారని, ఆ కాలంలో ఆయన ఖర్చు 3 వేల రూపాయలు కాగా కేవలం నాలుగు నెలల క్రితం పర్సన్ ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించిన కోన తాతారావు 30 లక్షల రూపాయలకు పైగా బ్యాంకు నిధులను పెద్ద ఎత్తున దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కారు పేరిట కారు డీజిల్ పేరిట లక్షల్లో తీసుకుంటున్నారని, విశాఖ గాజువాక వాసి అయిన ఆయన క్యాంప్ ఆఫీస్ పేరిట మూడు లక్షల రూపాయల ఫర్నిచర్ కోసం తీసుకున్నారని, అందుబాటులో ఉన్న కంప్యూటర్లు లాప్ టాప్‌లు వాడకుండా 1,80,000లతో యాపిల్ కంపెనీ డెస్క్ టాప్, 80 వేల రూపాయలతో కొత్త లాప్ టాప్ బలవంతంగా నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు నిధుల నుంచి కొనిపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటన్నింటి మీద విచారణ జరిపి కోన తాతారావు బృందం కబంధహస్తాల నుంచి పేద రైతులకు చెందిన విశాఖ సహకార బ్యాంకును రక్షించాలని కోరారు. నాలుగు నెలల వ్యవధిలో తాతారావు బృందంపై వచ్చిన ఆరోపణలు నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ సి.బి.సి.ఐ.డిలతో దర్యాప్తు జరిపించి అక్రమంగా వసూలు చేసిన నిధులను తిరిగి బ్యాంకుకి రికవరీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అవినీతిపరుడైన చైర్పర్సన్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తప్పించాల్సిన అవసరం ఉందని డిసిసిబి పరిధిలోని రైతులు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారని స్పష్టం చేశారు.

జీఓ ఇచ్చారు... లోన్లు మరిచారు

మంత్రి డోలాకు విదసం వినతి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఆర్భాటంగా జీఓ విడుదల చేసి 7 నెలలు గడుస్తున్నా ఒక్కరికి లోను మంజూరు కాలేదని, వెంటనే రుణాలు విడుదల చేయాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని కలిసి విజ్ఞప్తి చేసింది. విశాఖ పర్యటనలో ఉన్న మంత్రిని విదసం ప్రతినిధులు అంబేద్కర్ స్టడీ సర్కిల్ వద్ద కలిసి వివిధ సమస్యలు పై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన పథకాలన్నీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ఆ దిశగా కనీస చర్యలు లేవన్నారు. రుణాలు మంజూరుకు ఏప్రిల్ 1న జీఓ ఇచ్చి నేటికి 7 నెలలు అయినప్పటికీ లోన్లు మంజూరు కాలేదన్నారు. తిరుపతి తొక్కిసలాట, శ్రీకాకుళం కాశీ బుగ్గ మరణాలు, బస్సు ప్రమాద మృతులకు 25, 17 లక్షలు చెల్లించిన ప్రభుత్వం తురక పాలెం మృతులకు కేవలం 5 లక్షలే చెల్లించడంలో వివక్ష ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాజి ఓంకార్, డి.నిర్మల, సోడాదాసి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది క్రీడ టోర్నమెంట్ మెడల్స్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ లో క్రీడాకారులకు అందించే మెడల్స్ ను ఆవిష్కరించారు. పాలకమండలి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన మెడల్స్‌ను ఏయు అధికారులతో కలిసి ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ ఆవిష్కరించారు. మెడల్స్‌లో ఒకవైపు ఆంధ్ర విశ్వవిద్యాలయం లోగో, మరొకవైపు శతాబ్ది సంవత్సర లోగోలను పొందుపరిచారు. మెడల్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి కింగ్ రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు,జి. శశిభూషణరావు, జి.గిరిజ శంకర్, ఎం.వి.ఆర్ రాజు, కె.సీతామాణిక్యం, పద్మశ్రీ, క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, డీన్‌లు ఆచార్య ఎస్.హరినాథ్, జాలాదిరవి, ఏయుసిబ్ సంచాలకులు డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గీతం అసోసియేట్ ప్రొఫెసర్ పెరుమాల్ సుందరయ్య మృతి

విశాలాంధ్ర - మధురవాడ: గీతం యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆచార్య పెరుమాల్ సుందరయ్య గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ విభాగంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్'కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన స్వస్థలం విజయనగరం జిల్లా బొబ్బిలి సుందరయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. 2008లో ఆయన ఏయూలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. సుందరయ్య ఆకస్మిక మృతిపట్ల సహచర ఉద్యోగులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. పలువురు ఘనంగా నివాళులర్పించారు.

సాయి నిరంజన్ కాలనీలో ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర -పెందుర్తి: ఇటీవల వరకు ఆక్రమణలపై కళ్లుమూసుకున్న రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు కళ్లు తెరిచారు. నగరంలో నానాటికి పెరిగిపోతున్న అక్రమణలపై రెవెన్యూ, జీవీఎంసీ శాఖాధికారులు సంయుక్తంగా ఉక్కు పాదం మోపారు. వివరాల్లోకి వెళితే పెందుర్తి మండలం జీవీఎంసీ 96వ వార్డు సాయి నిరంజన్ కాలనీ రహదారి గత కొన్నాళ్లుగా ఆక్రమణలకు గురైంది. దీంతో ఇటీవల కోటిపల్లి పద్మ అనే మహిళ ఇక్కడి ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేసారు. దీనిపై స్పందించిన రెవెన్యూ, జీవీఎంసీ వర్గాలు సంయుక్తంగా దాడులు నిర్వహించి యుద్ధ ప్రాతిపదికిన ఆక్రమణలు తొలగించారు. ఈ దిశలో ఆక్రమణదారుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ తహశీల్దార్ వెంకట అప్పారావు, జెడ్ సి శంకర్రావు ఏ మాత్రం వెనకాడకుండా ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, జీవీఎంసీ ఏసిపి రామలింగారెడ్డి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, శ్రీహరి, పాత్రుడు, కిషోర్, ఆనంద్, వరలక్ష్మి, యమున, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశలో వ్యాక్సిన్ అవసరం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం ఆర్ఎంపి గ్రామీణ వైద్యులకు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో వైద్య అవగాహన సదస్సు జరిగింది. ప్రముఖ ఆంకాలజిస్ట్ డా. వంశీధర్ పుత్రేవ్ మాట్లాడుతూ రోజురోజుకీ క్యాన్సర్ బాధపడే రోగులు పెరుగుతున్నారని, అందుకు లైఫ్ స్టైల్‌లో మార్పులు కారణమని, యుక్త వయసులోనే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే, ముఖ్యంగా స్త్రీలలో క్యాన్సర్ వ్యాధిని తగ్గించవచ్చన్నారు. ఆడపిల్లలకు కౌమార దశలో హెచ్.పి.వి. వ్యాక్సిన్ వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, పద్మనాభం మండలం ఆర్ఎంపి వైద్యుల అధ్యక్షులు ర్యాలీ అప్పారావు, కార్యదర్శి ప్రసాద్, తాతబాబు, మీసాల వెంకటరమణ పాల్గొన్నారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ సోదాలు

రాష్ట్రవ్యాప్తంగా120 సబ్ రిజిస్టర్ ఆఫీసులపై దాడులు
పలు రిజిస్ట్రేషన్లు అక్రమాలపై ఆరా...

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: అవినీతి కేంద్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై వస్తున్న ఆరోపణ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 120 సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం నుండి రాత్రి 10 గంటల వరకు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. సబ రిజిస్టర్ కార్యాలయం సిబ్బంది తోపాటు రిజిస్టర్ల సెల్ఫోన్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నేడు కూడా ఈ సోదాలు కొనసాగుతాయని తెలుస్తుంది. నగరంలోని సూపర్ బజార్, మధురవాడ, పెదగంట్యాడ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై జిల్లాల్లో ఏకకాలంలో రైడ్స్ జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులను అధికారులు పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే మధురవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అనధికారికంగా పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సూపర్ బజార్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఓ డాక్యుమెంట్ కాగితాల లోపల 10 వేలు దొరికినట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది. ఏసీబీ అధికారులు రిజిస్టర్ గట్టిగా ప్రశ్నించినట్లు సమాచారం. ఇద్దరు సబ్ రిజిస్టర్లులో ఒకరు సెలవు పెట్టడంతో ఒక్కరే ఉన్నారు. ఈ కార్యాలయంలో పదిమంది సిబ్బంది కూడా పనిచేస్తున్నారు. అనేక సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లే ముడుపులు వసూలు చేస్తూ ఎవరి వాటాల వరకు అందిస్తున్నట్లు వస్తున్న ఆరోపణ నేపథ్యంలో వారిపై కూడా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

అయితే సూపర్ బజార్ ప్రధాన సబ్ రిజిస్టర్ కార్యాలయం కావడంతో విశాఖ జిల్లాలో వారి శాఖ నుండి ఏ అధికారులు వచ్చినా ప్రోటోకాల్ వ్యవహారాలు ఈ కార్యాలయం అధికారులే చూడాల్సి వస్తుంది. డిఐజి కార్యాలయం, ఐజి కార్యాలయం, జిల్లా రిజిస్టర్ కార్యాలయం ఆలనా పాలన అంతా వేరే చూడాల్సి వస్తుంది ఉన్నట్లు తెలుస్తుంది. రోజు 72 ఫ్లాట్స్ సామర్థ్యం కలిగిన రిజిస్టర్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నది సూపర్ బజార్, మధురవాడ, భోగాపురం వంటి సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో లావాదేవీలు తాకిడి అధికంగానే ఉంది. మధురవాడ, భోగాపురం సబ్ రిజిస్టర్లకు కనీస విషయ పరిజ్ఞానం తక్కువగా ఉందని అనేక మంది డాక్యుమెంట్ రైటర్లు తెలియజేస్తున్నారు. వసూలు చేయడంలో వీరు మహాదిట్ట అని కూడా అనేకమంది క్రయవిక్రయదరులు ఫిర్యాదు చేస్తున్నారు. భోగాపురం సబ్ రిజిస్టర్ అయితే ముందు తన వాటా ఇస్తేనే రిజిస్టర్ చేస్తానని పార్టీకి చెబుతున్నట్లు అనేకమంది ఆరోపిస్తున్నారు. సాధారణంగా రిజిస్టర్ కార్యాలయానికి క్రయవిక్రయాల లావాదేవీల ఆస్తి విలువలో 0.5 శాతం ముడుపులు ఇవ్వాల్సిందే. వీటినే ఆయా రిజిస్టర్లు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి డాక్యుమెంట్‌కి రూ.200 చొప్పున లెక్క కట్టి ఏ రోజు దా రోజు లేదా వారానికి ఒకరోజు 15 రోజులకు ఒకసారి చొప్పున పంపకాలు చేసుకుంటారని తెలుస్తుంది.

గూగుల్ సెంటర్‌కు భూములిచ్చేది లేదు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనంద పురం మండలం తర్లువాడ పంచాయతీలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేటాయించిన దళితుల అసైన్డ్ భూములను సిపిఐ విశాఖ జిల్లా ప్రతినిధి బృందం బుధవారం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ 1971వ సంవత్సరం నుండి అప్పటి ప్రభుత్వం దళితులకు రెండు ఎకరాలు చొప్పున 48 కుటుంబాలకు సాగు చేసుకోవడానికి భూమిని ఇచ్చి పట్టాలు ఇవ్వడం జరిగిందని ఈ భూముల్లో ఎస్సీ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో బోరుబావులు వేసుకొని డ్రిప్ ఇరిగేషన్ చేస్తూ ప్రకృతి వ్యవసాయం సాగు చేయడంలో గ్రామ రైతులు అగ్రభాగాన నిలిచారని అన్నారు. ఇప్పుడు ఈ భూములను అర్ధాంతరంగా ఎటువంటి నోటీసులు లేకుండా వారి భూములు డేటా సెంటర్‌కి ఇస్తాననడం సరైన చర్య కాదన్నారు. ఇప్పటికే అదాని డేటా సెంటర్ పేరుతో 400 ఎకరాల భూమిని గతంలో కేటాయించారని ఆ కేటాయించినటువంటి భూములు డేటా సెంటర్‌ని ఏర్పాటు చేయలేదని, యువతకి ఉపాధి కల్పించ లేదని, భూములు మాత్రం అదానీ చేతిలో పెట్టారన్నారు. డేటా సెంటర్ కోసం ఆనందపురం తర్లువాడ పంచాయతీలో దళితులు బీసీల భూముల్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రతినిధి బృందంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎం.మన్మధరావు, వనజాక్షి, ఎండి బేగం, నెయ్యల నాగభూషణరావు, దళిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విశాఖపట్నం, గాజువాక
13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
EP.16/2016 in OS 548/2015
బిట్వీన్
ముదునూరి రామకృష్ణ త్రినాధ వర్మ ...DHr
మరియు
పేరిచర్ల నరసింహరాజు ...JDr
JDr:
పేరిచర్ల నరసింహరాజు, S/o సుబ్బరాజు, R/o. A-బ్లాక్, నరసింహా టవర్స్, అగనంపూడి టోల్ గేట్ ప్రక్కన, శివాజీనగర్ ఎదురుగా, శనివాడ గ్రామము, అగనంపూడి, గాజువాక మండలం, విశాఖపట్నం-53.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు పై కేసులో JDr గా అయి ఉండీ మీ హాజరు నిమిత్తం తేదీ 19-11-2025కు పై కోర్టు వారు వాయిదా వేసి యున్నారు. మీకు పై కేసులో సేల్ నోటీసు (Sale Notice) పంపించినప్పటికీ మీరు కోర్ట్‌కు హాజరు కాకపోవడము వలన పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం తేదీ 19-11-2025 ఉదయం 10 గం. 30 నిమిషములకు పై కోర్ట్ వారు ముందు మీరు గాని, మీ ప్లీడరు ద్వారా గాని హాజరు నిమిత్తం ఈ పేపరు ద్వార మీ హాజరుకై ఆర్డరు వేసియున్నారు. మీరు హాజరు కానీ పక్షములో పై కేసులో మీకు వాదన లేదని భావించి మీ పరోక్షంగా పై కేసు తీర్మానించబడును.
By order
డి వి రామారావు.
అడ్వకేట్, గాజువాక
9849595933

రాష్ట్ర భవిష్యత్తుకు తలమానికంగా భాగస్వామ్య సదస్సు

ఇన్ఛార్జి మంత్రి డోలా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 14, 15వ తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న ప్రపంచ స్థాయి భాగస్వామ్య సదస్సు రాష్ట్ర భవిష్యత్తుకు తలమానికం కానుందని, ఈ మహా కార్యాన్ని దిగ్విజయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవిరళ కృషి చేస్తోందని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి, ఇతర కేబినెట్ మంత్రులు పలు దేశాల్లో పర్యటించి పారిశ్రామిక వేత్తలను, పెట్టుబడిదారులను ఆహ్వానించారని గుర్తు చేశారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. సుమారు 40 పైచిలుకు దేశాల నుంచి వందల సంఖ్యలో అతిథులు, వివిధ కంపెనీల ప్రతినిధులు విచ్చేస్తున్నారని తెలిపారు. సదస్సు నిర్వహించటం ద్వారా రాష్ట్రానికి రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి స్వామి పేర్కొన్నారు. ఏయూలో జరుగుతున్న ఏర్పాట్లు, వేదికలు, ఇతర అంశాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంత్రికి, ఇతర ప్రజా ప్రతినిధులకు మ్యాప్ సహాయంతో వివరించారు. పర్యటనలో మంత్రితోపాటు ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జిల్లా కలెక్టర్, సీఐఐ ప్రతినిధి మౌళి, ఇతర అధికారులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

విశాలాంధ్ర - మల్కాపురం: సీఎం సహాయ నిధి పేదలకు వరమని ప్రభుత్వ విప్ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని సీ.ఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు 63, 59, 60, 57వ వార్డులో గణబాబు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ అంగ దుర్గా ప్రశాంతి, 63వ కార్పొరేటర్ గల్లా చిన్న, శిరం. ఉమా మహేశ్వరి, రామ్మోహన్ నాయుడు,పోతబత్తుల శ్రీను, 57వ వార్డ్ అధ్యక్షుడు పెంటకోట అజయ్, 57వ వార్డ్ కార్పొరేటర్ మురు వాణి, పారిశ్రామిక ప్రాంత ఏడువార్డుల ఇన్‌చార్జ్ నీలాపు జోజ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి అంగన్వాడీ పోస్టులు..?

నేతల సిఫార్సులకే పెద్దపీట

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఇటీవల విశాఖ జిల్లాలో అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్స్ పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో అనేకమంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఇచ్చిన వారికే పోస్టులు ఎంపిక సాగుతున్నట్లు తెలుస్తుంది. నామమాత్రంగానే నోటిఫికేషన్, ఇంటర్వ్యూల పేరిట అధికారులు తతంగాన్ని నడుపుతున్నారనీ ప్రచారం సాగుతుంది. జీవీఎంసీ పరిధిలో ఆయా అవార్డుల్లో రిజర్వేషన్ల ఆధారంగా ఖాళీలు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే అవార్డు కార్పొరేటర్లు ద్వారా పోస్టులు దక్కించుకునేందుకు దరఖాస్తు దారులు కొంతమంది ఎమ్మెల్యేల వద్దకు పిఏలను ఆశ్రయిం చడంతో కార్యకర్తకు పోస్టుకు రెండు లక్షలు, ఆయా పోస్టుకు లక్ష చొప్పున రేట్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని ఇస్తేనే వారు సిఫార్సు లేక ఇస్తున్నారని ప్రచారం సాగుతుంది. సెలక్షన్ కమిటీ అధికారులు ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్దపీట వేస్తున్నారని, కొన్నిచోట్ల రిజర్వేషన్లు ను సైతం పక్కనపెట్టి పోస్టులు కట్టబెట్టేందుకు నేతలు అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని కూడా ప్రచారం సాగుతుంది.

ఇప్పటికే తీవ్ర పని భారంతో చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్న అంగన్వాడి కార్య కర్తలు, ఆశలకు ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని యూనియన్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వేధింపులు కూడా అధికంగా ఉన్నాయని అనేకమంది వాపోతున్నారు. వివిధ రకాల యాప్ లతో పాటు అన్ని పనులకు అంగన్వాడి కార్యకర్తలనే ఉపయోగించుకోవడంపై యూనియన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వార్డుల్లో రాజకీయ నేతల వేధింపులు కూడా అధికంగానే ఉన్నాయని పలువురు కార్యకర్తలు, ఆయాలు తెలియజేస్తున్నారు. కార్యకర్తలు, ఆయాల పోస్టులు భర్తీలో పారదర్శకత కన్నా సిఫార్సులకే పెద్దపీట వేస్తున్నారని ప్రచారం సాగుతుంది.

అధిక సంఖ్యలో దరఖాస్తులు

అర్బన్ ఐసిడిఎస్ పరిధిలో రెండు కార్యకర్తలు పోస్టులకు 32 దరఖాస్తులు రాగా, 21 ఆయా పోస్టులకు 95 దరఖాస్తులు వచ్చాయని, భీమిలి ప్రొజెక్టు పరిధిలో 5 కార్యకర్తల పోస్టులకు 32 దరఖాస్తులు వచ్చాయి. 11 ఆయా పోస్టులకు మూడు మాత్రమే దరఖాస్తులు రాగా, పెందుర్తి ప్రొజెక్టు పరిధిలో కార్యకర్తల పోస్టు లకు ఖాళీలు లేకపోవడంతో 21 ఆయా పోస్టులకు 99 దరఖాస్తులు వచ్చాయని పీడీ కేవీ రామా లక్ష్మీ తెలిపారు. అర్హులైన వారికే నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తామని పీడీ స్పష్టం చేశారు.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.297/2024 IN O.S 22/2024
బిట్వీన్
జాగార్లమూడి వెంకట రమణ శ్రీవాత్సవ .....పిటిషనరు.
అండ్
హాఫీజుల్లా షైక్ వగైరాలు..... రెస్పాండెంట్లు
1,2,3,4,5 రెస్పాండెంట్లకు I.A.ల నోటీసు.
టు,
1) హాఫీజుల్లా షైక్ తండ్రి లేటు హామీదుల్లా షైక్, అల్లిపురం మసీది దగ్గర, వయసు 38, వ్యాపారి, నివాసం డోర్ నెంబర్ 44-22-48,ఫ్లాట్ నెంబర్-302, శ్రీ నిలయం, రామాలయం వీధి, రైల్వే న్యూ కాలనీ, విశాఖపట్నం.
2) కరీం ఉన్నిసా బేగం లేటు హామీదుల్లా , వయసు 84, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, సాయి బాబా గుడి దగ్గర, అచీయమ్మపేట, విశాఖపట్నం.
3) శంషాద్ బేగం భర్త హామీదుల్లా, వయసు 60, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, సాయిబాబా గుడి దగ్గర, అచియమ్మపేట, విశాఖపట్నం.
4) వహీదా బేగం, హామీదుల్లా కుమార్తె, వయసు 41, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, సాయిబాబా గుడి దగ్గర, అచియమ్మ పేట, విశాఖపట్నం.
5)షేక్ ఫరీదా, హమ్మదుల్ల కుమార్తె వయసు 40, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, ప్రగతి అపార్ట్మెంట్స్, సాయిబాబా గుడి దగ్గర అచియమ్మపేట, విశాఖపట్నం.
పై నంబర్ I.A.లో పై కోర్టు వారు పంపిన నోటీసులు, మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 9-12-2025వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షే పణలను తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు I.A. తీర్మానించబడును.
A.V.S. భవాని ప్రసాద్
అడ్వకేట్, అనకాపల్లి.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S 22/2024
బిట్వీన్
జాగార్లమూడి వెంకట రమణ శ్రీవాత్సవ ..... వాది.
అండ్
హాఫీజుల్లా షైక్ వగైరాలు..... ప్రతివాదులు
1,2,3,4,5 ప్రతివాదులకు దావాసమను.
టు,
1) హాఫీజుల్లా షైక్ తండ్రి లేటు హామీదుల్లా షైక్, అల్లిపురం మసీది దగ్గర, వయసు 38, వ్యాపారి, నివాసం డోర్ నెంబర్ 44-22-48,ఫ్లాట్ నెంబర్-302, శ్రీ నిలయం, రామాలయం వీధి, రైల్వే న్యూ కాలనీ, విశాఖపట్నం.
2) కరీం ఉన్నిసా బేగం లేటు హామీదుల్లా , వయసు 84, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, సాయి బాబా గుడి దగ్గర, అచీయమ్మపేట, విశాఖపట్నం.
3) శంషాద్ బేగం భర్త హామీదుల్లా, వయసు 60, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, సాయిబాబా గుడి దగ్గర, అచియమ్మపేట, విశాఖపట్నం.
4) వహీదా బేగం, హామీదుల్లా కుమార్తె, వయసు 41, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, సాయిబాబా గుడి దగ్గర, అచియమ్మ పేట, విశాఖపట్నం.
5)షేక్ ఫరీదా, హమ్మదుల్ల కుమార్తె వయసు 40, గృహిణి, డోర్ నెంబర్ 32-1-186/4, ప్రగతి అపార్ట్మెంట్స్, సాయిబాబా గుడి దగ్గర అచియమ్మపేట, విశాఖపట్నం.
పై నంబర్ దావాలో పై కోర్టు వారు పంపిన సమన్లు, మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 9-12-2025 వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షే పణలను తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడును.
A.V.S. భవాని ప్రసాద్
అడ్వకేట్, అనకాపల్లి.

బాలుర వసతి గృహంలో బోరు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం గ్రామపంచాయతీ బాలుర వసతి గృహంలో మంచినీళ్ళ బోరును మండల పరిషత్ నిధులతో మండల ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక చొరవతో వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి బుధవారం బేడ బుడగ జంగాల కాలనీ వద్ద మంచినీళ్ల బోరుకు శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం గురువారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పాల్గొననున్నారని మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. మండలంలోని జడ్పిటిసిలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సరిపల్లి మల్లన్న ఆలయంలో కార్తీక పౌర్ణమి

విశాలాంధ్ర- పెందుర్తి: కార్తీక పౌర్ణమి సందర్భంగా పెందుర్తి మండలం, సరిపల్లి గ్రామంలో స్వయంభువుగా వెలసిన పురాతన మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి నేరుగా పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపించారు. తెల్లవారు జామునుండే వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకోవడంతో పరిసరాలు క్రిక్కిరిసి పోయాయి. ఆలయ ప్రధాన అర్చకులు కోనేటి నరసింగరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, జి ఆర్ కె జగన్నాథం, ఎంపిటిసి రమణ, గణపతి, ప్రసాదు,రామకృష్ణ,పరమేశ్వరరావు భక్తులకు ఏర్పాట్లు చేసారు.

విశాఖలో 22 ఏ సమస్యని పరిష్కరించండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌ని బుధవారం కలిసి గతంలో వి ఏం ఆర్ డి ఏ వేసిన లేఔట్ ప్లాట్స్, వుడా నుండి ఆక్షన్‌లో కొన్న స్థలాలు కూడ 22ఏ పరిష్కరించాలని కోరారు. భూములు 22ఏలో పెట్టడం వల్ల అమ్ముకోవడానికి, బ్యాంక్ ఋణం తీసుకోవడానికి, లేదా నిర్మాణాలు చేపట్టడానికి కుదరక ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జగన్ మురారి పాల్గొన్నారు.

యువతను డ్రగ్స్ బానిసలుగా మార్చిన వైసీపీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: యువతను డ్రగ్స్ బానిసలుగా వైసిపి నాయకత్వం మార్చిందని జనసేన, ఏబివిపి, టి ఎన్ ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు ఆరోపించారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు సంయుక్తంగా మాట్లాడారు. జనసేన పార్టీ నాయకులు మర్రివేముల శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పేరుతో వైసిపి యువతను పెడదారిన పట్టిస్తోందని ధ్వజమెత్తారు. విద్యార్థి సంఘ నాయకులు దేశం కోసం త్యాగం చేసిన నాయకుల కోసం చెప్పాలి కానీ విద్యార్థుల భవిష్యత్తు దారి తప్పేలా చేయరాదన్నారు. డ్రగ్ ఫ్రీ విశాఖపట్నం కోసం విద్యాలయాలలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాం అన్నారు. ఏ బి వి పి నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వ విద్యాలయ కేంద్రంగా జరుగుతున్నా డ్రగ్స్ దందాపై ఉక్కు పదం మోపుతూ టాస్క్ ఫోర్స్ ప్రతి 3 నెలలకు ఒక సారి యూనివర్సిటీలు, కళాశాలలు ను పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ప్రెసిడెంట్ రత్నకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి ప్రావీణ్యతను తెలియజేసే గాలిమేడను పునఃనిర్మించండి

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి ప్రాంతానికి సోయగాలు పొలికించే పురాతన గాలిమేడను పునఃనిర్మించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేసారు. బుధవారం ఎంవిపిలో ఉన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. భీమిలికి ఆధ్యాత్మిక పరంగా, సాంస్కృతిక పరంగా ఎంతో ప్రావీణ్యత ఉందని అదేవిదంగా ఆంగ్లేయుల పాలనలో భీమిలి ప్రాంతంలో కొన్ని అదునాతన కట్టడాలు నిర్మించారని అన్నారు. అందులో ఒకటి గాలిమేడ అని వివరించారు. సముద్ర తీరంలో నిర్మించిన గాలిమేడ ఎంతో చక్కని ఆహ్లాదాన్ని ఇచ్చిందని ఎమ్మెల్యే గంటాకు ఇచ్చిన వినతిపత్రంలో తెలియజేసారు.

ఐకానిక్ పసుపు బామ్‌ను తిరిగి విడుదల చేసిన అమృతాంజన్ హెల్త్‌కేర్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: అమృతాంజన్ పసుపు బామ్ (చిన్న ఉపశమనపు డబ్బా) 130 సంవత్సరాలకు పైగా భారతదేశంలోని ప్రతి ఒక్కరి దైనందిన జీవితాలలో గాఢంగా పెనవేసుకుపోయింది. ఇది పడకగదిలో ఉన్నా, ట్రావెల్ బ్యాగ్‌లో ఉన్నా, లేక తలనొప్పి లేదా ఒళ్లు నొప్పి వచ్చినప్పుడల్లా ఒక చేతి నుండి మరొక చేతికి ప్రేమగా అందించబడినా, దాని ఉపశమనం కలిగించే సువాసన, సాంత్వననిచ్చే స్పర్శతో కేవలం ఉపశమనం మాత్రమే కాక, అపురూపమైన జ్ఞాపకాలను కూడా అందిస్తుంది. చాలా మందికి, ఇది కేవలం ఒక ఉత్పత్తి కాదు. వారి కుటుంబ కథలో ఒక భాగం, ఒక శతాబ్దానికి పైగా చెక్కుచెదరని నమ్మకానికి, ధైర్యానికి ప్రతీక. ఈ ప్రయాణం అమృతాంజన్ దూరదృష్టి గల వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు తో ప్రారంభమైంది. 1867లో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో జన్మించిన ఆయన కేవలం ఒక పారిశ్రామికవేత్త మాత్రమే కాదు, స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు, సంఘ సంస్కర్త కూడా. 1893లో, ఆయన అమృతాంజన్ బామ్‌ను పరిచయం చేశారు. ఇప్పుడు ప్రతి సీసా 25 శాతం అదనపు బామ్‌తో వస్తుంది. తద్వారా తరతరాలుగా నమ్మిన సౌకర్యాన్ని కుటుంబాలు మరింత ఎక్కువగా పొందేలా చూస్తుంది.

భాగస్వామ్య సదస్సు పనులు జీవీఎంసీకి ప్రతిష్టాత్మకం

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు కు చేపట్టిన పనులు జీవీఎంసీకి చాలా ప్రతిష్టాత్మకమని, పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్లో ఈ నెలలో జరిగే సిఐఐ భాగస్వామ్య సదస్సుకు చేస్తున్న అభివృద్ధి పనులతో పాటు జీవీఎంసీ అన్ని వార్డులలో చేపట్టిన అభివృద్ధి పనులపై జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ఈ నెలలో నిర్వహించే భాగస్వామ్య సదస్సు కు చేపడుతున్న అభివృద్ధి, నగర సుందరీకరణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని, పనులలో లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామని మేయర్ తెలిపారు. భాగస్వామ్య సదస్సుకు చేపడుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలిస్తానని మేయర్ తెలిపారు. భాగస్వామ్య సదస్సుకు విశాఖ నగరానికి దేశ విదేశాల నుండి ఎంతోమంది ప్రతినిధులు వస్తున్నందున జీవీఎంసీ నిధులతో చేపడుతున్న నగర సుందరీకరణ పనులలో ఎటువంటి జాప్యం లేకుండా పనులు త్వరతగతిన ఆకర్షణీయంగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జివిఎంసి పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్, గోవిందరావు, కె. శ్రీనివాసరావు, రాయల్ బాబు, శాంతి రాజు, కార్యనిర్వహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

వీపీఏ కార్యదర్శి వేణుగోపాల్‌కు పారదీప్ పోర్ట్ డిప్యూటీ చైర్మన్‌గా పదోన్నతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్‌కు పారదీప్ పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్మన్‌గా పదోన్నతి పొందారు. ఆయనను పరదీప్ పోర్ట్ డిప్యూటీ చైర్మన్ గా నియమిస్తూ కేంద్ర పోర్టులు నౌకా జలరవాణా శాఖా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. వేణుగోపాల్ 1995లో విశాఖపట్నం పోర్టులో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం పోర్టులోని వివిధ విభాగాల్లో పలు పదవుల్లో సేవలందించారు. 2019లో ఆయన కార్యదర్శిగా పదోన్నతిపై దీన్ దయాళ్ (కాండ్లా) పోర్ట్ అథారిటీలో సేవలు అందించారు. 2020లో తిరిగి విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో కార్యదర్శిగా బదిలీ అయ్యి ఇప్పటివరకు సేవలు అందిస్తున్నారు. తన పదవీకాలంలో ఆయన బీమ్ స్టిక్ , ఇండియన్ మేరిటైమ్ కాన్క్లేవ్‌లు, ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవం, అంతర్జాతీయ క్రూయిజ్ నౌకల విశాఖ పోర్ట్ సందర్శనలు వంటి అనేక ప్రధాన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. తన అంకితభావం, ప్రతిభావంతమైన సేవలను కేంద్ర మంత్రిత్వశాఖ గుర్తించి సముచితంగా గౌరవించింది. వేణుగోపాల్ పదోన్నతి పట్ల విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ ఆయన తన నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కేజీహెచ్‌లో డయాలసిస్ యూనిట్ పునఃప్రారంభం

విశాలాంధ్ర - వన్‌టౌన్: ప్రజలు ఆరోగ్యంగా.. ఆనందంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దానిలో భాగంగానే వైద్య సేవలను యూనివర్శల్ డిజిటలైజ్డ్ విధానంలో ప్రజలకు చేరువ చేస్తున్నామని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. సీఎస్సార్ కింద ఎన్టీపీసీ సమకూర్చిన రూ.2 కోట్ల ఆర్థిక సహాయంతో కేజీహెచ్ నెఫ్రాలజీ విభాగంలో ఆధునికీకరించిన హీమో డయాలసిస్ యూనిట్ ను ఆయన బుధవారం పునఃప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ముందుగా యూనిట్ లోపల కలియ తిరిగిన ఆయన రోగులతో మాట్లాడారు. వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని దానిలో భాగంగా అందరికీ ఉపయోగపడేలా రూ.25 లక్షలతో సార్వత్రిక ఇన్సూరెన్స్ కల్పించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ డా. రవిరాజు, ఏఎంసీ ప్రిన్సిపాల్ డా. కేవీఎస్ సంధ్యాదేవి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సూపరింటెండెంట్ డా. ఐ.వాణి, ఆర్ఎంవో డా. శ్రీహరి, నెఫ్రాలజీ విభాగం ఇన్చార్జి హెచ్వోడీ డా. రత్నప్రభ, ఎన్టీపీసీ ప్రతినిధులు పాత్రో, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వైపరీత్యాల్లో చేతులెత్తేస్తున్న కూటమి: బొత్స

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తుఫానులు, వైపరీత్యాలలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు రూపాయి పరిహారం కూడా ప్రకటించ లేదన్నారు. ఇప్పటి వరకు ఏకంగా రూ.2.27 లక్షల కోట్ల అప్పు చూపిస్తున్నారని, తెస్తున్న ఆ అప్పు మొత్తం ఏమవుతోందని నిలదీశారు కాశీబుగ్గ దుర్ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యతని, ప్రభుత్వ వైఫల్యం వల్లనే ఆలయంలో తొక్కిసలాట జరిగి ప్రాణ నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్ఘటనపై చంద్రబాబు, మంత్రుల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు వైసీపీ ప్రభుత్వం అండగా నిలిచిందాన్నారు. ప్రజలు, రైతుల పట్ల కూటమి ప్రభుత్వం కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. మొంథా తుపాన్‌లో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకో వడంతో పాటు, కాశీబుగ్గ దుర్ఘటనకు కారణాలు ఏంటో, బాధ్యులెవరో సమాధానం చెప్పాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు.

విశాఖపట్నంలో ప్రారంభమైన అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్

- 22న అలెన్ షార్ప్ స్కాలర్షిప్ పరీక్ష

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలోని ఇంజనీరింగ్, వైద్య విద్య కోర్సుల ప్రవేశ పరీక్ష తయారీకి శిక్షణ ఇస్తున్న ప్రముఖ సంస్థ అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం (వైజాగ్)లో తన ఆఫ్‌లైన్ క్లాస్‌రూమ్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని ప్రకటించింది. ఈ మేరకు వరుణ్ బీచ్‌లోని హోటల్ నోవోటెల్‌లో బుధవారం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా ఇనిస్టిట్యూట్‌ను అధికారికంగా ప్రారంభించారు. అలెన్ ఉపాధ్యక్షుడు జోనల్ హెడ్ మహేష్ యాదవ్, అలెన్ ఆంధ్ర-తెలంగాణ కోఆర్డినేటర్ సీతారాం నందూరి, తమిళనాడు హెడ్ సంతోష్ సింగ్, తెలంగాణ హెడ్ సౌరభ్ తివారీ హాజరయ్యారు. అతిథులు సంయుక్తంగా అలెన్ వైజాగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహేష్ యాదవ్ మాట్లాడుతూ 'ఏ కారణం చేతైనా, అలెన్ తరగతి గది కేంద్రాలను చేరుకోలేని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ తన శాఖలను నిరంతరం విస్తరిస్తూ వెళుతోందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సమన్వయకర్త సీతారాం నందూరి, వైజాగ్ సెంటర్ హెడ్ నితిన్ ముఖేష్ పాల్గొన్నారు. నవంబరు 22న నిర్వహిస్తున్న అలెన్ షార్ప్ పరీక్షకు నమోదు చేసుకునే విద్యార్థులు వారి పనితీరు ఆధారంగా 90 శాతం వరకు నగదు బహుమతులు, స్కాలర్‌షిప్‌లు పొందవచ్చని సంస్థ ప్రకటించింది.

అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా దీపోత్సవం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసురావు

విశాలాంధ్ర - పద్మనాభం: అన్ని శాఖల సమన్వయంతో ఈనెల 19 న జరగనున్న అనంత పద్మనాభస్వామి దీపోత్సవాన్ని విజయవంతం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. దీపోత్సవ నిర్వహణ సన్నద్ధతపై బుధవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ భక్తులు ఎంత ఎక్కువ సంఖ్యలో వచ్చినా.. ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కాశీబుగ్గ ఆలయంలో జరిగిన దురదృష్టకర సంఘటనను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా భక్తులకు మంచి అనుభూతి కలిగేలా దీపోత్సవ నిర్వహణ ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వ హామీల్లో భాగంగా ఉచిత బస్సు సదుపాయం కల్పించిన నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి దీపోత్సవానికి వచ్చే మహిళల సంఖ్య గణనీయంగా పెరగవచ్చని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఆలయానికి ఘాట్ రోడ్డు సౌకర్యాన్ని కల్పించడం.. దెబ్బతిన్న ఆలయ కలశాన్ని పున ప్రతిష్ఠ చేయడం.. ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనంత పద్మనాభస్వామి వారి దీపోత్సవ పోస్టర్ ను గంటా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.సంగీత్ మాథుర్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, ఏసీపీ అప్పలరాజు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, ఈఓ రాజు, తహసిల్దార్ కె ఆనందరావు, ఎం పి డి ఓ రూపేష్, ఎంపీపీ కె రాంబాబు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, గాదు వెంకటప్పడు, రామరాజు, మొకర అప్పలనాయుడు, కాళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కణమాం గ్రామ సభలో డీఎల్‌డీఓ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం కణమాం సచివాలయం పరిధిలో డిఎల్‌డిఓ మేడం నిర్మలాదేవి పర్యటించి గ్రామ ప్రజలకు సచివాలయ ప్రాముఖ్యత కోసం వివరించారు. సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, తడి, పొడి చెత్త కోసం వివరించి ప్రజలను గ్రామాల శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆబోతు అప్పల రాము, పంచాయతీ కార్యదర్శి కుమార్, వైస్ సర్పంచ్ సూరిబాబు, గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల కలను సాకారం చేసిన క్రీడాకారిణులు

బిజెపి బీసీ నేత మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: ఐదు దశాబ్దాల కలను భారతీయ క్రికెట్ మహిళా మణులు ఎట్టకేలకు సాకారం చేయడం పట్లభారతీయ జనతా పార్టీ బీసీ నేత మూల వెంకట్రావు హర్షం వెలిబుచ్చారు. అద్భుత ప్రదర్శనతో ప్రపంచ కప్ సాధించి వారికి వారే సాటిగా నిలిచారని ప్రశంసించారు. 1973లో మన దేశంలో మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్ పోటీలలో భారతీయ మహిళల ప్రస్థానం ప్రారంభమైందని, వరుసగా రెండు సార్లు అండర్-19 అమ్మాయిల జట్టు నెగ్గడం, తాజాగా సీనియర్ జట్టు విజయం సాధించడం, మహిళా క్రికెట్ కు దేశంలో బలమైన పునాది పడినట్లుగా ఆయన వెల్లడించారు. ప్రపంచ కప్ లో వరుసగా మూడు పరాజయాలతో డీలా పడిన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో అమోల్ ముజుందార్ మెంటార్‌గా అందించిన ప్రోత్సహం ఆటగాళ్ళ మానసిక దృఢత్వాన్ని బలంగా పెంచిందని వెల్లడించారు. కడప జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ళ శ్రీ చరణి, ప్రపంచ కప్పులో 14 వికెట్లు తీసి నాలుగో స్థానంలో నిలబడటం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చిందన్నారు. దీప్తి శర్మ, హర్మన్ ప్రీతికౌర్ కెప్టెన్సీ ఇలా అందరి సమిష్టి కృషి భారత జట్టును జగజ్జేతగా నిలిపిందన్నారు. జట్టులో సగం మంది దిగువ మధ్య తరగతి వారేనని తెలిపారు

పారదీప్ పోర్టుకు డిప్యూటీ చైర్మన్‌గా నియమితులైన వేణుగోపాల్‌కు సత్కారం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం పోర్ట్ సెక్రటరీ వేణుగోపాల్ ఒరిస్సా పారదీప్ పోర్టుకు డిప్యూటీ చైర్మన్‌గా దాదాపు ఐఏఎస్ క్యాడర్ ఉన్న పదోన్నతి పొందడం ఎంతో ఆనందంగా ఉందని పోర్ట్ పూల్ కళాశీల గౌరవ అధ్యక్షుడు , ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ అన్నారు. గురువారం దుశ్శాలువతో పుష్పగుచ్ఛంతో వేణుగోపాల్‌ని సత్కరించారు. గత 30 సంవత్సరాల నుండి పోర్ట్ పూల్ కళాసీలుగా పనిచేస్తున్న ఉద్యోగస్తులకు కూడా పదోన్నతి కల్పించి, ఉద్యోగ భద్రతతో పాటు వేతనాలు పెంచి, టైం స్కేల్ గా అవకాశం ఇవ్వాలని వేణుగోపాల్‌ని వినత పత్రం అందజేశారు. పూల్ కళాశీల సెక్రెటరీ సి.హెచ్ పోతురాజు, అధ్యక్షులు కలిమిరెడ్డి అప్పారావు, వాసుపల్లి రాము, కలిష, రమేష్ బాబు, హరికృష్ణ యాదవ్, సిహెచ్ అప్పలరాజు, శ్రీనివాస్ రెడ్డి, అలీమ్, ఏ. నాయుడు పాల్గొన్నారు.

స్టడీ సర్కిల్‌ను సందర్శించిన డా. డోలా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వం అందించే కోచింగ్ సద్వినియోగం చేసుకొని బాగా చదివి సమాజంలో మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఋషికొండ వద్ద గల బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రరీ, కంప్యూటర్ రూమ్, సెమినార్ హాల్ తదితర వసతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్‌లో కోచింగ్ పొందుతున్న విద్యార్థులతో మంత్రి మాట్లాడుతూ తీసుకునే కోచింగ్ సద్వినియోగం చేసుకొని బాగా చదివి సమాజంలో మంచి పేరు, ప్రఖ్యాతలు సంపాదించాలని సూచించారు. విద్యార్థుల వసతి, పాఠశాల వాతావరణం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీడీ సోషల్ వెల్ఫేర్ రామారావు, జిల్లా గురుకుల పాఠశాల కోఆర్డినేటర్ మిసెస్ గ్రేస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోటు యజమానులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - వన్‌టౌన్: గత రెండు సంవత్సరాలుగా వివిధ విపత్తుల కారణంగా సుమారు 12 బోట్లకు నష్టపరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు విన్నవించారు. ఎటువంటి ఆర్థిక సహాయం అందక వాళ్ళ జీవితాలు చితికిపోయాయని అన్నారు. మత్స్యకారులు కష్టాలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అలానే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి తీసుకువెళ్తానని జన వాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశి కృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. 37వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు గరికన రవి ధమీజైన బోట్లు పత్రాలు డామేజ్ విలువ ఎమ్మెల్యేకి అందజేస్తూ తక్షణమే వారికి న్యాయం జరిగేలా చూడాలని యజమానులు కోరారు.

శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తర ఆంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్య సేవలను అందించడంలో ప్రసిద్ధి చెందిన విశాఖపట్నం నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్ అండ్ ఇన్సిట్యూట్, దాని అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ కళాశాల విద్యార్థులను గుర్తించి సత్కరించడానికి అవార్డు ప్రదానోత్సవాన్ని నిర్వహించిందని ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. బంగారు రాజు ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా కోర్సులకు చెందిన 30 మంది విద్యార్థులు, ఓటీ విద్యార్థులు 20 మంది నూరుశాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని, చివరి సంవత్సరం పరీక్షలలో 15 మంది బిఎస్సీ ఆప్టోమెట్రీలో 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని బంగారు రాజు తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణ కుమార్ విద్యార్థుల కృషి అంకితభావాన్ని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. జనరల్ మేనేజర్ కె. రాధాకృష్ణన్ విద్యార్థుల విజయాలను ప్రశంసించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ పి. కృష్ణ ప్రసాద్ విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించడంలో విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో కళాశాల నిబద్ధతను హైలైట్ చేశారు. వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ నస్రిన్ విద్యార్థుల విజయాలను ప్రశంసించారు. అధ్యాపక ఇంచార్జి చోడే. భువన కల్యాణి కార్యక్రమాన్ని నిర్వ హించారు.



శ్మశానం వద్ద ఉరి వేసుకుని యువకుడు మృతి

విశాలాంధ్ర - కొమ్మాది: జీవీఎంసీ మధురవాడ చంద్రంపాలెం గ్రామ ప్రాంతంలో బుధవారం ఓ యువకుడి ఆత్మహత్య ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానిక శ్మశానం వద్ద ఉరి వేసుకుని ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసిన స్థానికులు వెంటనే పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడిని చంద్రంపాలెంకు చెందిన గేదెల ఫణి (18) గా పోలీసులు గుర్తించారు. ఫణి ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పీఎంపాలెం పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ హైస్కూల్‌ని సందర్శించిన ఆర్జేడీ

విశాలాంధ్ర - తగరపువలస: విశాఖపట్నం జోన్ వన్ ఆర్జేడీ బి.విజయ భాస్కర్ భీమునిపట్నం జీవీఎంసీ పండిట్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులు యొక్క ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. ఈ సంవత్సరం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ పుస్తకాలను తనిఖీ చేయడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక భీమునిపట్నం డైట్ ప్రిన్సిపల్ సుధాకర్, డైట్ లెక్చరర్ నాగేశ్వరావు, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

ఆ పార్టీలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ సిగపట్లు

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం తొలగింపులో మరోసారి బయటపడ్డ విభేదాలు

విశాలాంధ్ర - వన్‌టౌన్: విశాఖ మహానగర పరిధిలో జనసేన పార్టీ ఎమ్మెల్యే, కార్పొరేటర్ మధ్య ఆధిపత్య పోరు ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డ చందంగా సామాన్యులకు శాపమైంది. పబ్లిసిటీ కార్పొరేటర్‌గా పేరుపడ్డ ఆయన పోరాటం ఉనికి కోసమా... లేదా స్వప్రయోజనాల కోసమా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే ఇద్దరూ వైసీపీ నుంచి వచ్చినవారే.. ఇద్దరూ జనసేన పార్టీ నుంచి గెలిచినవారే. కానీ వారి మధ్య ఆధిపత్య పోరు నివురుగప్పిన నిప్పులా నడుస్తోంది.. నైట్ ఫుడ్ వెండర్స్ స్టాల్స్‌ను తొలిగించే క్రమంలో మొదలైన రగడ ఇప్పుడు సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం తొలగింపు వరకు కొనసాగుతూనే ఉంది. తనకు సంబంధం లేని నియోజకవర్గంలో వేలు పెడుతున్న కార్పోరేటర్‌ని ఎమ్మెల్యే నిలువరించే లేకపోతున్నారని రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. వీధి వ్యాపారుల తొలగింపు సందర్భంలో సమస్యను ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్న ఎమ్మెల్యే హామీ హామీగానే మిగిలి పోయింది. ఇప్పుడు ఆయన నియోజక వర్గంలో జనసేన పార్టీ అనుభూతిపరులు ఏర్పాటు చేసిన సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని తొలగించేటప్పుడు కూడా స్థానిక ఎమ్మెల్యే ఏమి చేయలేకపోయారనే చెప్పాలి. సినిమా షూటింగ్‌లతో బిజీ బిజీగా ఉండే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విశాఖ జిల్లాలో పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు జన సైనికుల్లో వ్యక్తమౌతున్నాయి. విపక్షంలో ఉన్నప్పటి నుంచే అధికారపక్షంపై హైకోర్టులో పబ్లిక్ ఇంట్రెస్ట్ ఎడ్యుకేషన్ పిటిషన్లు వేయడం అలవాటున్న సదరు కార్పొరేటర్ అధికారపక్షంలో ఉన్నప్పటికీ స్వపక్షం పైనే కోర్టు కేసులు వేస్తున్నారు. తన వార్డు అభివృద్ధి పక్కన పెట్టి జిల్లాలోని, రాష్ట్రంలోని అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే ఆ కార్పొరేటర్ వైఖరిని ఇప్పుడు అందరూ శంకిస్తున్నారు. జనసేన నేతలపైనే నేరుగా ఫిర్యాదులు చేయడం కూడా ఆ పార్టీలో తీవ్ర తలనొప్పి గానే మారింది. బుధవారం స్వర్గీయ కృష్ణ విగ్రహం తొలగించిన ప్రదేశంలో జనసేన జెండాను ఆవిష్కరించారు.

స్పా ముసుగులో వ్యభిచారం

చీకటి దందాలో, పోలీసుల పాత్రపై అనుమానాలు!

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: వి ఐ పి రోడ్ సమీపంలో ఉన్న ఆర్చిడ్ వెల్ నేస్ స్పా సెంటర్ అక్రమ కార్యకలాపాలు జరుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ , 3వ పట్టణ సీఐ తమ సిబ్బంది మరియు ఇద్దరు మధ్యవర్తులతో కలిసి పైన పేర్కొన్న ఆర్చిడ్ వెల్ నేస్ అండ్ స్పా సెంటర్ పై దాడి నిర్వహించి ఐదుగురుపై కేసులు నమోదు చేశారు, అయితే నగరం నలుమూలలా వెలిసిన అనేక స్పా సెంటర్లు , మసాజ్ పార్లర్‌లు సేవ పేరుతో వ్యభిచార గృహాలుగా మారుతున్నాయనే ఆరోపణలు ఇటీవల తరచుగా వినిపిస్తున్నాయి. పోలీసులు దాడులు నిర్వహించి నిర్వాహకులను, విటులను అరెస్టు చేసి, మహిళలను రెస్క్యూ చేయడం సర్వసాధారణంగా మారింది. అయితే, ఈ చీకటి దందా వెనుక మరిన్ని లోతైన విషయాలు ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి. స్పా ముసుగులో వ్యభిచారం యథేచ్ఛగా కొనసాగడానికి పోలీసుల సహకారం ఉందనేది ప్రధాన ఆరోపణ. కొన్ని సెంటర్ల నిర్వాహకులు ప్రతి నెలా పోలీసులకు ముడుపులు ఇస్తున్నారని, అందుకే వారిపై చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. ఈ "మామూళ్లు" వ్యభిచారం అనుమతించే సెంటర్లకు ఒక రకంగా, ఇతర సేవలు అందించే సెంటర్లకు మరొక రకంగా నిర్ణయించి వసూలు చేస్తున్నారనే వార్తలు సైతం ప్రచారంలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో వ్యభిచారం జరుగుతున్నట్టు స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ, స్థానిక పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పోలీసుల నిఘా వైఫల్యానికి ఇదొక నిదర్శనంగా చెప్పవచ్చు,కొన్ని సందర్భాలలో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లేదా పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినప్పుడు మాత్రమే ఈ దందాలు బయటపడుతున్నాయి. ఈ దాడుల సమయంలో కూడా, కొందరు స్థానిక పోలీసులు నిర్వాహకులతో సఖ్యత వహిస్తున్నారని, వారికి ముందే సమాచారం ఇస్తున్నారని ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ దందా వెనుక కేవలం పోలీసుల పాత్రే కాకుండా, రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉన్నాయనే తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కొంతమంది రాజకీయ నాయకులు లేదా వారి అనుచరులు ఈ స్పా సెంటర్ల నిర్వాహకులకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని, అందుకే స్థానిక పోలీసులు వారి జోలికి వెళ్లడానికి భయపడుతున్నారని తెలుస్తోంది. కొందరు స్పా నిర్వాహకులకు అటు రాజకీయ నాయకులతో, ఇటు పోలీసులతో బలమైన సంబంధాలు ఉన్నందువల్ల, ఈ దందా అడ్డూ అదుపు లేకుండా నడుస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఈ అనుమానాలను బలపరుస్తూ, కొన్ని దాడుల తర్వాత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, లేదా తక్కువ సమయంలోనే తిరిగి వారు వ్యాపారాన్ని ప్రారంభించడం వంటి ఉదంతాలు కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కూడా ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ అక్రమ కార్యకలాపాలకు సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన సందర్భాలు ఉన్నాయి. స్పా ముసుగులో జరుగుతున్న వ్యభిచారం అనేది కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదు, అధికారుల లోపాలు మరియు రాజకీయ జోక్యం వంటి అంశాలతో కూడిన సంక్లిష్టమైన వ్యవస్థగా రూపాంతరం చెందిందనే ఆందోళన పెరుగుతోంది. ఈ చీకటి దందాను సమూలంగా అరికట్టాలంటే, పోలీసు యంత్రాంగంలో ప్రక్షాళన చేయడంతో పాటు, రాజకీయంగా ఎటువంటి అండదండలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లలో ఇకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్టర్ ఆఫీసులలో ఏసీబీ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పెదగంట్యాడ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చిన వారితో విచారణ జరిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కాలాతీతం అవుతున్న తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చిన ప్రజలు అసహనం వ్యక్తపరిచారు. గత రెండు నెలలుగా పెదగంట్యాడ రిజిస్టర్ ఆఫీస్ లో టిడ్కో ఇల్ల రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం.

పెన్షనర్ల సమావేశం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ సి డబ్ల్యూ సి హాలులో ఆల్ పెన్షన రిటైర్డ్ పర్సనల్ ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కనితి అప్పలరాజు అధ్యక్షతన వహించారు. ఈ సమాసానికి జిల్లా అధ్యక్షులు కే దేనిబండ్ మాట్లాడుతూ మన దేశంలో 78 లక్షల మంది పెన్షనర్ ఉన్నారని వీరు వెయ్యి రూపాయల నుంచి 3000 రూపాయలు లోపలే పెన్షన్ తీసుకునేవారు ఉన్నారు అని అన్నారు. గత పది సంవత్సరాల గా మినిమం పెన్షన్ 9000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారు. దీనికి అనుగుణంగా డీఏ ఇవ్వాలని భార్యాభర్తల కి మెడికల్ సౌకర్యం కల్పించాలని వైట్ రేషన్ కార్డు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పించి ఇచ్చి అయ్యర్ పెన్షన్ ఇవ్వాలని మూడు సంవత్సరాలు కావస్తుంది. మొక్కు బడిగా కొద్దిమందికే పంపిస్తూన్నారు. పెన్షనర కి సరి అయిన ఇంటిమేషన్ లేక పోవుటవలన చాలా అవస్థలుపడుతున్నారు. అర్హులైన వారికి డిమాండ్ లెటర్ పంపించవలసిందిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నమ్మి అప్పలనాయుడు, మేడిశెట్టి వెంకట్రావు, శేసెట్టి అప్పారావు, నర్సింగరావు, డి గురునాథ్, కొండబాబు,నమ్మి రవణ, పాల వెంకయ్య, పెద్దడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

23న రాజ్యాంగ దినోత్సవ సదస్సు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 23న నగరంలోని రామా టాకీస్ రోడ్డులో గల అంబేద్కర్ భవన్‌లో భీమ్ సేన వార్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామని ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కార్యక్రమ గోడ పత్రికను అంబేద్కర్ భవన్‌లో డాక్టర్ ఆరోగ్యరాజ్, అంబేద్కర్ వాది కె.బి.ఆర్. అంబేద్కర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నవంబర్ 23 మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందని, కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత ప్రొఫెసర్ కంచ ఐలయ్య (హైదరాబాద్), అతిథులుగా మూఢనమ్మకార నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు డా బేరి నరేష్, ప్రముఖ జర్నలిస్టు తులసి చందు (హైదరాబాద్) బహుజన కళామండలి వ్యవస్థాపకుడు ఉదయభాస్కర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. డాక్టర్ ఆరోగ్యరాజ్ మాట్లాడుతూ వేలాది సంవత్సరాలుగా అణిచివేతకు గురవుతున్న పీడిత కులాలతో పాటు అన్ని సామాజిక వర్గాలకు సమాన హక్కులను భారత రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యమనేత కె.బి.ఆర్. అంబేద్కర్, దళిత, బహుజన, ప్రజాసంఘాల నాయకులు జి. ఉమామహేశ్వరరావు,డాక్టర్ రవికుమార్, రాంబాబు, విజయానంద్ ఇంటి గురు మూర్తి చింతాడ సూర్యం పాకా సత్యనారాయణ ,మల్లయ్య రాజు, బత్తుల శ్రీనివాస్, నక్కా సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ ,గౌతమ్ బాబు , పెయ్యల సిద్దార్థ. కె .సింహాచలం, ఎం. ఎస్ .ఎస్. ఎస్. సింగ్, తిరుమలరావు, భరత్ కుమార్, ఇ.వి. రావు, ఉమామహేశ్వరి, డాక్టర్ హరీష్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ అంబేద్కర్, డాక్టర్ మోహన్, డాక్టర్ కిరణ్, డాక్టర్ రాజ్ కుమార్ భీమ్ సేన వార్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

2027 భారతదేశ జనాభా గణనకు సిద్ధం కండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారతదేశ జనాభా గణనలో నమోదయ్యేందుకు ప్రజలు సిద్ధం కావాలని రాష్ట్ర జన గణన డైరెక్టర్ జె. నివాస్ పేర్కొన్నారు. బుధవారం ఆయన భీమిలి మండలం ప్రజా పరిషత్ కార్యాలయం, జీవీఎంసీ జోనల్ కార్యాలయంలోనూ ఇండ్ల గణనపై (ముందస్తు పరీక్ష) కార్యక్రమాన్ని రాష్ట్ర జన గణన డైరెక్టర్ అధ్యక్షతన జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో ఎన్యూమ్ రేటర్లకు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జన గణన డైరెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఇండ్ల గణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ముందుగా రాష్ట్రంలో ఉన్న 4 సెంటర్లలో ఇండ్ల గణన కార్యక్రమం జరుగుతుందని, అందులో ఒక సెంటర్ అయిన విశాఖపట్నం కాగా, భీమిలి జోన్ పరిధిలోని 2,3 వార్డులలో ప్రీ - టెస్ట్ కార్యక్రమాన్ని భీమిలి జోనల్ కార్యాలయంలో, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రారంభించి నిర్వహించడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగా మొదటి దశగా ఇండ్ల జాబితా, ఇండ్ల గణనకు సంబంధించి, ఎన్యూమ్ రేటర్లకు, సూపర్వైజర్లకు నవంబర్ 4 నుండి 6 వరకు ఈ శిక్షణను ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందులో మొదటి దశగా ఇండ్ల జాబితా తయారు చేయడం, ఆ ఇండ్లలో ఎంతమంది నివాసం ఉంటున్నారు, జన గణన ఏ విధంగా నిర్వహించాలి, పాటించవలసిన జాగ్రత్తలు, వాటి ప్రాముఖ్యత మొదలైనవి శిక్షణ కార్యక్రమం లో ఆయన విపులంగా ఎన్యూమ్ రేటర్లకు, సూపర్వైజర్లకు వివరించారు. నవంబర్ 1 నుండి 7 వరకు జరుగు ఇండ్ల

గణనపై సెల్ఫ్ రిజిస్ట్రేషన్ (స్వయం నమోదు) ప్రక్రియలో ప్రజలు స్వచ్ఛందంగా నమోదు చేసుకోవాలని, అలాగే నవంబర్ 10 నుండి 30 వరకు ఈ ఇండ్ల గణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇండ్ల గణన జరిగేటప్పుడు ఇంటికి వచ్చే ఎన్యూమ్ రేటర్లకు , సూపర్వైజర్లకు సహకారం అందించాలని నగర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి రమణమూర్తి మాట్లాడుతూ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని, ఆ దిశగా ఇండ్ల గణనకు శిక్షణ పొందుతున్న ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ప్రజలకు అవగాహనను కల్పిస్తూ, ఇండ్ల గణనపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెన్సెక్స్ డిప్యూటీ డైరెక్టర్ దయాసాగర్, జోనల్ కమిషనర్ ఇప్పినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా జల హారతి

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి వరాహ పుష్కరిణి లో జల హారతి కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సింహాచలం వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కొండ దిగువన గల వరాహ పుష్కరిణికి సంప్రదాయబద్ధంగా జల హారతి ఇచ్చారు. ఇంచార్జ్. కార్యనిర్వహణాధికారి ఎన్. సుజాత , ఇఇ రమణ, అధికారులు ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్, పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు (2) సీతా రాముడు పుష్కరిణి లోని జలాలకు షోడశోపచార పూజలు చేశారు. అష్ట హారతి, నక్షత్ర హారతులు పుష్కరిణికి సమర్పించారు. పుష్కరిణి ఒడ్డున భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రమిదల్లో దీపారాధన చేశారు. గోపాలపట్నం సి.ఐ సన్యాసి నాయుడు, ఎస్.ఐ అప్పలనాయుడు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొమ్మాది: విశాఖపట్నం సిటీ ఆరిలో పోలీస్ స్టేషన్ పరిధిలో, సుమారు సాయంత్రం 6:30 గంటల సమయంలో ఒక వ్యక్తి అయినా ఆలేట్ సూర్యనారాయణ, s/o రామస్వామి, 65 సంవత్సరాలు, గురుద్వాలకు చెందిన వ్యక్తి, ఈరోజు ఉదయం పైనాపిల్ కాలనీలో ఉన్నటువంటి వాళ్ళ చుట్టాలు ఇంటికి వచ్చి, ఈరోజు సాయంత్రం ఇంటికి వెళ్ళటానికి అని, పైనాపిల్ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా, సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వచ్చు మోటార్ సైకిల్ వారు గుద్దడం వలన స్పాట్లోనే హెడ్ ఇంజనీ అయి చనిపోయినారు. బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు కూడా ఇంజురీస్ అయినాయి. వారిని ట్రీట్మెంట్ నిమిత్తం హాస్పిటల్ కి తరలించడమైనది. చనిపోయిన వ్యక్తిని తదుపరి దర్యాప్తు నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.